


"చిన్నికృష్ణుడు యశోదమ్మ ముందు చేతులు కట్టుకుని నిలబడి నోరు తెరిస్తే ఆ నోటిలో యశోదమ్మ ఏడేడు పధ్నాలుగు లోకాలూ, ఆకాశమూ, భూమీ చూసింది కదా!"

"అయితే?"

"మరి అప్పుడు యశోదా, కృష్ణుడూ దేనిమీద నిలబడినట్లు?"

వెంకట్రావుగారి ప్రశ్నతో నేను ఖంగు తిన్నాను. సమాధానంకోసం ఆలోచిస్తున్నట్లు బుర్ర తడుముకున్నాను.

ఈలోగా థర్డ్ బెల్ వినబడడంతో వెంకట్రావుగారు అటెండెన్స్ రిజిష్టర్ తీసుకుని ఆదరాబాదరా క్లాస్‌రూమ్‌వైపు నడిచారు.

"ఐనా నీ కిదేం కొత్త కాదు కదటయ్యా, రామకృష్ణా! అలా బెల్లంకొట్టిన రాయిలా నిలబడి పోతావు! రోజూ ఉండే తంతే కదా, ఆయన రాత్రల్లా ఆలోచించి ఏదో సందేహం పట్టి తీసు కురావడం, దాని గురించి మీరిద్దరూ బుర్ర బద్ద లుకొట్టుకోవడం!" అన్నాడు నవ్వుతూ హిందీ మాస్టారు వెంకటేశ్వర్లు.

"పొరబాటున మన వెంకట్రావు కా పేరు పెట్టారు గానీ, 'నిత్య సందేహరావ్' అని పేరు పెట్టి ఉండాల్సింది!" అని తన జోక్‌కి తానే ఫెళ్లున నవ్వారు రిటైర్‌మెంట్ అంచునున్న సంస్కృతం మాస్టారు వరదాచార్యులు.

వాళ్లన్నమాటలు నిజమే. వెంకట్రావుగారిలో ఏదో "తపన, జిజ్ఞాస" ఎక్కువగా ఉన్నాయి. ఎప్పుడూ ఏదో సందేహం ఆయన బుర్రను తొలుస్తూ ఉంటుంది. ఆ సందేహం ఒక సబ్జెక్ట్‌కి మాత్రమే పరిమితమై ఉండదు. సైన్సు, సాహి త్యం, చరిత్ర, రాజకీయాలూ ... ఒకటేమిటి, ఈ భూమి మీద ఉన్న సకల చరాచర సృష్టి ఆయన సందేహాల కతీతం కావు.

"అశోకుడు ఓడించిన కలింగరాజు పేరెం దుకు చరిత్ర పుస్తకాల్లో లేదు?"

"రాముడు వాలిని చెట్టు చాటు నుంచి చంప డం పాపం కాదా?"

"రోదసి లోంచి చూస్తే భూమి ఎలా కనిపి స్తుంది? గుండ్రంగానా, బల్లపరుపుగానా?"

"నేతాజీ ఇంక బతికే ఉన్నాడా? అయితే ఎక్కడున్నట్లు? ఏమైనట్లు?"

వెంకట్రావుగారికి కలిగే సందేహాల గురించి మా మధ్యవాదన కొన్ని రోజులు, కొన్ని వారాల పాటూ కూడా జరిగేది. తీరా ఒక సందేహం నివృత్తి అయ్యేనాటికి మరో సందేహం ఆయ నను ఆవహించేది. ఈ సందేహాల చర్చలో మాత్రం మా స్కూల్లోని మిగిలిన మాస్టార్లు తల దూర్చేవారు కాదు. "ఇరుక్కుపోతే మళ్లీ బయట పడలేము!" అని వాళ్లు అనుకోవడంతో చర్చలు మా ఇద్దరి మధ్యే పరిమితమయ్యేవి.

వెంకట్రావుగారిది పెద్ద కుటుంబమే. పెద్ద కొడుకు శంకర్ హోసూర్‌లో ఏదో ఫాక్టరీలో పని చేస్తున్నాడు. రెండోవాడు ఆదినారాయణ తండ్రితో పోట్లాడి మద్రాసులో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. వెంకట్రావుగారు ఆదినారా యణ పేరెత్తడు, అతనూ ఇంటికి రాడు. ఇద్దర మ్మాయిలు కాలేజీలో చదువుకుంటున్నారు.

నేను వాళ్లింటికెళ్లినప్పుడల్లా వాళ్లావిడ నాతో అంటూండేది 'మా ఆదినారాయణ విషయమే నాకు చాలా బెంగగా ఉంటుంది. ఈయన అతని మాట పట్టించుకోడు. అతనూ ఈయన మీద కోపంతో ఇంటికి రాడు. మీరైనా ఆయ నతో మాట్లాడి చూడండి!' అనేది.

కానీ వెంకట్రావుగారు ఆదినారాయణ పేరెత్తి తేనే ముభావంగా మారి ఆ చర్చను అంతటితో ఆపేసేవారు. వారి పోట్లాటకసలు కారణమేదో నాకు తెలియనే తెలియదు. "అయినా, తండ్రీ కొడుకుల పొట్లాట ఎంతకాలముంటుంది?" అని నేననుకునే వాణ్ణి.

ఆ రోజు ఉదయం వెంకట్రావుగారు ఉరుకు పరుగులమీద స్టాఫ్‌రూమ్‌లో ప్రవేశించారు.

ఏదో పెద్ద సందేహమే ఆయన నావహిం చింది అనుకున్నారేమో, స్టాఫ్ మెంబర్లు ఒకరొ కరూ జారుకోసాగారు.

"ఏమిటి మాస్టారూ ఆ కంగారు?" అని ప్రశ్నించాను.

"నిన్న చిత్తూరు బస్టాండులో నా క్లాస్‌మేట్ ధనంజయం కనిపించాడోయ్! అతనితో మాట్లా డుతూ ఉంటే నాకొక కొత్త విషయం తెలిసింది. అలాంటిలాంటిది కాదది!" అన్నారు.

నాలో ఆసక్తి పెరిగింది.

"మన జాతీయ గీతం నీకు తెలుసుగా. ఎందుకైనా మంచిది. ఒకసారి పాడు, విందాం! అల్లూరి సీతరామరాజెవరంటే కృష్ణ అంటారు ఈ కాలంకుర్రాళ్లు."

"జనగణ మన అధినాయక జయహే ..."

"ఆగాగు ...!" అన్న వెంకట్రావుగారి మాటతో నా కూనిరాగానికి బ్రేక్ పడింది.

"ఇంతకీ ఈ 'అధినాయక' అనే పదానికి అర్థమేమిటి? అది ఎవరిని ఉద్దేశించబడింది? నువ్వెప్పుడైనా ఆలోచించావా?" అన్నారు గంభ నంగా.

నేను ఏకాగ్రత తెచ్చుకున్నాను. నిజమే, ఈ అధినాయకుడెవ్వరు? నేనెప్పుడూ ఈ విషయం ఆలోచించలేదు.

"ధనంజయం హిస్టరీ ప్రొఫెసరు. ఆయన సిద్ధాంతం ప్రకారం రవీంద్రనాథ్ ఠాగూర్ 'జనగ ణమన' గేయాన్ని మన దేశాన్ని సందర్శించిన బ్రిటిష్‌రాజును ఆహ్వానిస్తూ రాశాడు. 'అధినా యక' అన్న పదం బ్రిటిష్ రాజును ఉద్దేశించి నదే."


నేను అవాక్కయ్యాను. బ్రిటిష్ రాజును ఆహ్వానిస్తూ రాసిన పాట మనకు జాతీయగీత మెలా అయింది?

"మాస్టారూ! మీరు, ఆ ధనంజయంగారు పొరబడుంటారు. ఠాగూర్ నిష్కళంకమైన దేశభ క్తుడు. అధినాయక అంటే బహుశా భగవంతుడో, లేకపోతే మహాత్మాగాంధీవంటి నాయకుడో అయి ఉండవచ్చు!" అన్నాను ఆగలేక.

"కానీ ఆ పాట రాసినప్పుడు, గాంధీజీ ఇంకా స్వాతంత్ర్య పోరాటంలోకే ప్రవేశించలేదే, చెప్పుకో దగ్గ నాయకులెవ్వరూ అప్పటికి ప్రాధాన్యత సంతరించుకోలేదు. ఇక దేశభక్తి ప్రబోధాత్మక మైన గేయంలో భగవంతుని ప్రస్తావన ఏముం టుంది?"

ఇంతలో అటెండర్ మస్తాన్ వచ్చి నన్ను హెడ్మాస్టర్ పిలుస్తున్నారనడంతో ఆ టాపిక్ అంతటితో ఆగింది.

మరో నాలుగురోజులు నాకు వెంకట్రావుగారు కనిపించలేదు. ఆరోగ్యం బాగాలేక సెలవు పెట్టా రట. పక్షల సమయం కాబట్టి నేనూ బిజీగా



ఉండి, ఆయనను చూడటానికి వెళ్లలేదు.

తరువాత మేం మళ్లీ కలుసుకున్నప్పుడు 'అధినాయకుడు'గురించి చర్చ కొనసాగింది.

"నువ్వేన్నయినా చెప్పు, రామకృష్ణా! ధనం జయలాంటి పరిశోధకుడి మాట అంత సుల భంగా తీసెయ్యలేము. ఉదాహరణకు మన స్కూల్‌కి అధినాయకుడెవరంటావ్?"

"హెడ్మాష్టరు గారో, ఈ స్కూలు కమిటీ ఛైర్మన్ భాస్కరరావుగారో కావచ్చు!" అన్నాను నేను.

"అంటే .... స్కూల్లో అత్యంత ముఖ్యమైన వ్యక్తి. అంతే కదా! అలాగే ఆనాటి భారతదేశంలో అత్యంత ముఖ్యుడు ఎవరంటావ్? ముమ్మాటికీ బ్రిటిష్ రాజే!" అన్నారు వెంకట్రావుగారు.

"అలాగే ఎందుకనుకోవాలి, ఎవరో ప్రజాప్ర ముఖుడనుకోవచ్చుగా! ఆ మాటకొస్తే మన స్కూలుకు కూడా అధినాయకులు ఇంకొకరుండ వచ్చు!" అంటూ నేను పదో క్లాసు చదువుతున్న ఒక స్టూడెంట్‌ను పిలిచాను.

"ఒరే, మన స్కూల్లో మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్ ఎవరు?" అసహనంగా దిక్కులు చూస్తూ నిలుచున్న ఆ కుర్రాణ్ణడిగాను కొంచెం కటువుగా.

వాడు నిర్ఘాంతపోయి పారిపోయేందుకులా ద్వారంవైపు చూశాడు. మావంక చూసి అంత సుల భంగా వాడిని వదలమని అర్థం చేసుకు న్నాడు.

"మన స్కూల్లో మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్ మరెవరూ, రామనాథంగారే!" అన్నాడు.

నా నెత్తిన పిడుగు పడినట్లయింది. రామనాథంగారు తెలుగు మాస్టారుగా రిటైరై ఆరేళ్లయింది. మరెందుకాయనను వి.ఐ.పి. అనుకుంటున్నాడీ బడుద్ధాయ్? ఆ సంగతే అడిగాను.

"మాకు తెలుగు పొయెట్రీ పోర్షన్ కాకముందే మాస్టారు ట్రాన్స్‌ఫరై వెళ్లిపో యారు. అప్పటినుంచీ రోజూ స్పెషల్ క్లాస్ తీసుకుని ఫ్రీగా రామనాథంగారే మాకు పాఠాలు చెబుతున్నారు!" అన్నాడు వాడు.

వాడు వెళ్లిన తర్వాత వెంకట్రావుగా రితో అన్నాను "చూశారా, స్టూడెంట్స్ ఎప్పుడూ తమకు మేలు చేసేవారినే తల చుకుంటారు. ప్రజలైనా అంతే, కాబట్టి నా దృష్టిలో అధినాయకుడంటే ఏ 'బెంగాల్ కరవు' సమయం లోనో ప్రజలనాదుకున్న జమీందారైనా కావచ్చు!" అన్నాను.



"ఆ మాటకొస్తే ఠాగూర్ సామాన్య భారత దేశ పౌరుడిని దృష్టిలో ఉంచుకుని అధినాయకుడిగా భారతీయుడినే వర్ణించి ఉండవచ్చు కదా!" అన్నారు వెంకట్రావుగారు.

"ఇది నిజంగా పండితులెవరైనా తేల్చాలి?" అన్నాను నేను.

పరీక్షలు ముంచుకురావడంతో ఇంటివద్దే పిల్ల లకు ట్యూషన్లూ, రాత్రింబవళ్లూ చదివించడం, ఇన్విజిలేషన్ డ్యూటీలతో వారం రోజులు గడిచిపో యింది.

హఠాత్తుగా మా బాబాయికి ఒంట్లో బాగాలేదని టెలిగ్రాం రావడంతో నేను నెల్లూరికి వెళ్లాను. తిరిగి వచ్చేసరికి వెంకట్రావుగారు పోయారన్న పిడుగు లాంటి వార్త తెలిసింది. శక్తినంతా కూడదీసుకుని వెంకట్రావు గారింటికి వెళ్లాను.

ఆ ఇల్లు విషాదం మూర్తీభవించినట్లుంది. వెంకట్రావుగారి భార్య వసారాలో దిగాలుగా కూర్చుని ఉంది. నన్ను చూడగానే బావురుమంది.

"ఊరుకోండమ్మా, మరిలా ఉంటే పిల్లలకెవరు ధైర్యం చెప్తారు?" గొంతు పెగల్చుకుని నా కంఠం లోంచి వచ్చాయి ఏవో మాటలు.

ఆమె కంఠం రుద్ధమైంది. "ఇలా జరుగుతుం దని కలలో కూడా అనుకోలేదు, బాబూ! హఠాత్తుగా పక్షవాతం సోకి కాళ్లూ, చేతులూ పడిపోయాయి. నాలుగురోజుల్లోనే అంతా అయిపోయింది!" అంది కళ్లు వత్తుకుంటూ.

నాకూ కళ్లల్లో నీళ్లు నిండాయి.

మాటలు కూడదీసుకుంటూ చెప్పిందావిడ "మా కొకటే తృప్తి. కాళ్లూ చేతులూ పడిపో యిన సమయంలో కూడా మా రెండో అబ్బాయి పేరే కలవరించారాయన. ఇన్నాళ్లూ అతని మీదున్న ద్వేషం మాయమైంది. ఆదినా రాయణకూడా కబురుపంపిన వెంటనే ఇంటికి వచ్చాడు. నాకదే తృప్తి!" అంది.

నాకు వారం రోజుల క్రితం జరిగిన సంఘటనలు లీలగా మనసులో మెదిలాయి. సందేహాలను వెంకట్రావుగారు ఆఖరి స్టేజ్‌లో కూడా మర్చిపోలేదన్నమాట.

"అదినాయకుడా? ఆదినారాయణా?" ఆయన నోట చివరిసారిగా పలికిన మాటకు అర్థమేమిటి? అధినాయకుడి అంతరార్థం ఆయ నకు ఆఖరి నిముషాల్లో బోధపడిందా?

గోడమీదున్న వెంకట్రావుగారి ఫొటోకు నమస్కరించి వెనుతిరిగాను. ఎలాగైతేనేం, తండ్రీ కొడుకులు ఆఖరి ఘట్టంలోనైనా కలు సుకోగలిగారు.

అయితే వెంకట్రావుగారు తన చివరి క్షణాల్లో హీనస్వరంతో ఎవరి పేరు ఉచ్చరించారో నాకిప్ప టికీ సస్పెన్స్‌గానే మిగిలిపోయింది. ■

## బేటా నంబర్ వన్!

అతి గొప్పనటుడుగా, బిగ్ బీగా పేరున్న అమితాభ్‌బచ్చన్ కొడుకైన అభిషేక్ సరసన, ఐశ్వర్యారాయ్ ఒక చిత్రంలోనూ, కరిష్మాకపూర్ రెండు చిత్రాల్లోనూ నటించబోతున్నారు. అభిషేక్‌ను 'స్మాల్ బీ' అంటున్నారు బాలీవుడ్‌లో. దర్శకుడైన ఎడిటర్ ముత్తు దర్శకత్వంలో కీర్తిరెడ్డి హీరోయిన్‌గా ఓ చిత్రాన్ని ఒప్పుకున్నాడు అభి. ఈ అమ్మాయిని చూసి జనమంతా ఓ..., ఇదైపోతున్నార్ట (అభీ మాత్రం కాదని వార్త). మరో సంగతేమిటంటే దర్శకుడు డేవిడ్‌ధవన్ అభీని ఓ చిత్రానికి తీసుకున్నాట్ట. ఆ చిత్రానికి డేవిడ్ ఏం పేరు పెడతారో ఊహించండి చూద్దాం! 'బేటా నంబర్ వన్' అని అనుకుంటున్నారు. గోవిందతో ఈ రకం నంబర్ల చిత్రాలు తీయటానికి అలవాటు పడ్డ డేవిడ్ మరి! ఇకపోతే ఈ చిత్రం కోసం ఓ పాటను చిత్రీకరించారు. ఆ సందర్భంలో యూనిట్‌లో అందరూ అభిషేక్‌బచ్చన్‌ను తెగ మెచ్చుకున్నారు. అయినా ఇలా డాన్సులు చేయటం 'జీన్సు'లో లేదే, ఎలా వచ్చింది స్మాల్ బీకి? అని బుగ్గలు నొక్కుకుంటున్నారట. మరి స్మాల్ బీయా, మజాకా?

ఎన్.